మంచి కవితతో కొంచెం సేపు
విన్నకోట రవిశంకర్



# నవనవం

నెలనెలా ఒక మంచి కవితాపరిచయం

అనువాదం రెండు దిశల్లోనూ ఉంటుంది. తెలుగులో వచ్చిన గొప్ప రచనలు ఇతర భాషల్లోకి అనువదింపబడి, విస్తృత ప్రచారం పొందాలని మనం ఆశిస్తాం. అలాగే, ఇతర భాషల్లో వచ్చిన గొప్ప సాహిత్యాన్ని తెలుగులో చదువుకోవాలనే కోరిక కూడా ఉంటుంది. ఇందులో రెండో దిశగా ప్రయత్నాలు విరివిగానే సాగాయి. ఇటీవలి కాలంలో దీవి సుబ్బారావు గారు, అనేక ఇతర భాషలలో కవిత్వాన్ని తెలుగులోకి తెచ్చేందుకు విశిష్టమైన కృషి చేసారు. కన్నడ వచనాలకు ఆయన చేసిన అనువాదాల సంకలనం "మాటన్నది జ్యోతిర్లింగం" అద్భుతమైన పుస్తకం. అలాగే, బైబిల్ లోని song of solomon ను "పరమగీతం" పేరిట, ఇంకా సూఫీ కవిత్వాన్ని కూడా ఆయన అనువాదం చేసారు. వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు, బుద్ధుడు - వీరి రచనల నుంచి కొన్ని ఎంచిన శ్లోకాలకు సుబ్బారావుగారు చేసిన అనువాదం "నవనవం" అన్న పేరుతో వెలువడింది. మహాకవుల కావ్యాలెప్పుడూ కొత్తగా నవనవలాడుతూ ఉంటాయనే విషయాన్ని ఈ పేరు సూచిస్తుంది. ఇందులో అధికశాతం వాల్మీకి రామాయణం నుంచి తీసుకున్నవే. వీటిలో కొన్ని అందమైన వర్ణన కలిగి వుంటాయి. వివిధ ఋతువుల గురించి రాసిన మనోహరమైన శ్లోకాల అనువాదాలు ఇందులో ఉన్నాయి. మరి కొన్ని శ్లోకాలు ధర్మాన్ని ఉపదేశించేవి. వీటిలో ఒక నీతి కథను చెప్పే అనువాదమే మనం పరిశీలిస్తున్న కవిత. ప్రస్తుతం రాముని గురించి విస్తృతంగా వాదోపవాదాలు జరుగుతూ ఉండటం, ప్రపంచంలో హింసా ప్రవృత్తి మితిమీరిపోతూ ఉండటం - ఈ రెండుకారణాలవల్ల ఇందులో చెప్పే కథకిప్పుడు ఎంతో ప్రాధాన్యత ఏర్పడింది. అరణ్య వాసంలో ఉండగా రాముడు అనేకమంది రాక్షసుల్ని సంహరిస్తాడు. ఇటువంటి హింసా ప్రవృత్తిని విడిచిపెట్టమని సీత ఆయనకు చెబుతుంది. అట్లా చెప్పే సందర్భంలోనిదే ఈ కథ.

ప్రధానమైన ఉద్దేశ్యం ఒక సార్వజనీనమైన నీతిని తెలపటం కాబట్టి, ఇందులో పదప్రయోగం, పదచిత్రాలవంటి శిల్ప చర్చకు అంతగా ఆస్కారం లేదు. కాని, చెప్పిన సందర్భం విశిష్టమైనది. ఇది సూచించే సత్యం ఎంతో విలువైనది. వాల్మీకి వంటి మహర్షి చెప్పినప్పుడు, సత్యం కూడా కవిత్వంగా భాసిస్తుంది. భారతీయ సంస్కృతిలో క్షమ, అహింస వంటివాటికి ప్రాముఖ్యత తక్కువనిపిస్తుంది.(వాహనం లేని దేవుళ్ళుంటారు గాని, ఆయుధంలేని దేవుడెక్కడా కనబడడు.) "దుష్టశిక్షణ, శిష్టరక్షణ" అన్నప్పుడు కూడా, వారి ప్రథమ ప్రాధాన్యత దేనికో స్పష్టమౌతూనే వుంది. ఐనప్పటికీ చరిత్రలో భారతీయులే క్షమ, అహింస వంటి గుణాలను ఎక్కువగా కనబరిచారు. వేరొక వైపు, క్షమను విశిష్ట గుణంగా వెలుగులోకి తెచ్చిన జీసస్‌ను అనుసరించే దేశాల్లో అదెంతవరకూ రాణించిందన్నది సందేహమే. ఒక చెంప మీద కొడితే, ఇంకొక చెంపను చూపటం కాదు, ఎదుటివాడు భవిష్యత్తులో ఎప్పుడో మనల్ని కొట్టకుండా ముందే రెండు చెంపలూ వాయించటం ఇప్పుడు రాజనీతిగా చలామణీ అవుతోంది. ఇటువంటి సందర్భంలోనే సీత ఉపదేశం మరింత అవసరం. నిజానికి, మాట్లాడితే యుద్ధానికి కాలుదువ్వే దేశాధినేతలకు, సీతమ్మ వంటి భార్యలుంటే, ప్రపంచం మరింత మెరుగ్గా ఉండేదేమో! హింసకు మనిషి ఎలా అలవాటుపడేదీ ఈ నీతి కథలో బాగా చెప్పబడింది. నిరంతర ఆయుధ ధారణ మనిషి బుద్ధిని ఎలా ప్రభావితంచేస్తుందో యిది చూపిస్తుంది.

మరొక విధంగా కూడా ఈ కధను చూడవచ్చనుకుంటాను. ఇందులో కత్తిని కేవలం హింసకు మాత్రమే కాక, వేరే రకమైన ప్రతీకగా కూడా భావించవచ్చు. అది - తను బాధ్యుడు కాని వాటికి బాధ్యత వహించటం ద్వారా మనిషి తన నిజగుణాన్ని ఎలా కోల్పోతాడో చూపించటం. నిత్య జీవితంలో అనేకసార్లు మనం బాధ్యులు కానివాటికి కూడా మనల్ని బాధ్యులుగా ఊహించుకోవటంతోనే మన దుఃఖం ఆరంభమౌతుందని ఒక మిత్రుడంటూ ఉండేవాడు. ఇది చాలా వరకు నిజం. ఇందులో ముని ఎవరో ఇచ్చిన కత్తికి కాపలా కాస్తూ, తన శాంతిని, తపోగుణాన్నీ పోగొట్టుకుంటాడు. సంస్కృత శ్లోకాలకు అనువాదాలు ఇదివరలో చదివినా, దీవి సుబ్బారావుగారు సరళమైన తెలుగులో, వచన కవితలుగా వాటిననువదించటం కొత్తగా ఉంది. సంస్కృతం తెలియనివారికి, యువతరానికి మన సాంప్రదాయ సాహిత్యంపై ఆసక్తిని, అభిరుచిని పెంపొందిచటానికి ఇటువంటి రచనలు ఎంతగానో ఉపయోగపడతాయి.

కవిత పూర్తి పాఠం:

మృగాలు పక్షులు సుఖంగా ఉన్న వనంలో
ఒక ముని ఆశ్రమం కట్టుకుని వున్నాడు.
అతడెప్పుడూ సత్యాన్నే పలికే వాడు
శుచిగానే ఉండేవాడు
అతడి తపస్సు పాడుచేసేటందుకు
ఇంద్రుడు ఒకనాడు కత్తిపుచ్చుకొని
భటుని రూపంలో కనిపించాడు
మళ్ళీ వచ్చి తీసుకొనేదాకా
దీన్ని నీ వద్ద వుంచు అని చెప్పి వెళ్ళాడు
అది మొదలు దాన్ని కాపాడటం కోసం
మనసంతా దాని మీద పెట్టి
అది ఏమవుతుందో అని
దాన్ని చేత్తో పట్టుకుని తిరిగేవాడు
ఎప్పుడూ ఆయుధ ధారణవల్ల
మునీశ్వరుడికి తపస్సుపై శ్రద్ధ తగ్గింది
క్రమేణ
అతని బుద్ధి కూడ క్రూరంగా మారింది.

మూలం: వాల్మీకి రామాయణం, అరణ్యకాండ, 9వ సర్గ, శ్లో 3-9-16 నుండి 3-9-22 వరకు

అనువాదం : దీవి సుబ్బారావు